ఆగస్టు నుంచి నెలవారీ విద్యుత్ బిల్లులు ?

● పరిశీలిస్తున్న ప్రభుత్వం

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆగస్టు నుంచి నెలవారీ విద్యుత్ చార్జీ వసూలు ప్రయోగాత్మకంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.04 కోట్లకు పైగా విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఈ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి విద్యుత్ బోర్డు రెండు నెలలకు ఒకసారి మీటరు రీడింగ్ తీసి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తోంది. నిర్ణీత గడువులోగా విద్యుత్



చార్జీలు చెల్లించని కనెక్షన్లు కట్ చేస్తోంది. మళ్లీ ఆ చార్జీలను జరిమానాతో చెల్లించిన అనంతరం కనెక్షన్లు పునరుద్ధరిస్తున్నారు. ఈ క్రమంలో, రెండు నెలలకు ఒకసారి విద్యుత్ చార్జీలు చెల్లించే విధానానికి బదులు నెలవారీ చార్జీ విధానాన్ని అమలు చేయాలని పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

డీఎంకే ఎన్నికల హామీ...

గత 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతినెలా విద్యుత్ చార్జీలు వసూలు చేసే చర్యలు చేపడతామని ప్రకటించింది. ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో విద్యుత్ శాఖ తరఫున దాఖలైన పద్దులో.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసే పనులు పూర్తికాగానే నెలవారీ మీటర్ రీడింగ్ చేపట్టి విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తామని ఆ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తెలిపారు.

స్మార్ట్ మీటర్లకు టెండర్ల ఆహ్వానం...

రాష్ట్రంలోని విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. అందులో అర్హత కలిగిన 5-6 సంస్థలకు టెండర్లు అప్పగించారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, ఆలోగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుచేసి, నెలవారీ విద్యుత్ చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై విద్యుత్ బోర్డు అధికారి ఒకరు మాట్లాడుతూ... రాష్ట్రంలో 3 కోట్ల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. తొలివిడతగా కోటి ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసి, ప్రయోగాత్మకంగా నెలవారీ విద్యుత్ చార్జీల వసూళ్లు చేపట్టాలని నిర్ణయించామని, వచ్చే ఆగస్టు నుంచి ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలుకు రానుందని తెలిపారు.

కచ్చాదీవిని స్వాధీనం చేసుకోవాల్సిందే

● అసెంబ్లీలో తీర్మానం.. ఏకగ్రీవంగా ఆమోదం

● శాశ్వత పరిష్కారం కోసం ప్రధానికి స్టాలిన్ వినతి



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భారత్ - శ్రీలంక దేశాల మధ్య సముద్ర భూభాగంలో ఉన్న కచ్చాదీవును స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సహా భారతీయ జనతా పార్టీ, ఇతర పార్టీల సభ్యులంతా మద్దతివ్వడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించారు. రాష్ట్ర జాలర్లు భారత సముద్ర జలాల్లో చేపల వేటకు వెళ్లినప్పుడు శ్రీలంక నావికాదళం అక్రమంగా దాడులు చేయడంతో పాటు వారిని నిర్బంధించి తమ దేశానికి తరలిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని జాలర్లు కొన్ని దశాబ్దాలుగా కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం స్టాలిన్ తీర్మానం ప్రవేశపెట్టి ప్రసంగించారు. తమిళ జాలర్లు కూడా భారత దేశ మత్స్యకారులే అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తరచూ మరిచి పోతుందని ఎద్దేవా చేశారు. దీంతో తమిళ జాలర్లు కూడా భారత జాలర్లే అని పదేపదే కేంద్రానికి నొక్కి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తమిళ జాలర్ల కన్నీరు వల్లే సముద్రపు నీరు ఉప్పుగా మారిందని దివంగత అన్నాదురై చెప్పినట్లుగా మన జాలర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్క జాలరి కూడా అరెస్టు కానివ్వబోమని 2014లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ వాగ్దానం చేశారన్నారు. కానీ, శ్రీలంక నావికాదళం దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. శ్రీలంకలో చెలరేగిన రాజకీయ అస్థిరత కారణంగా పాత పాలకులు దిగిపోయి కొత్త పాలకులు అధికారంలోకి వచ్చారన్నారు. అయినప్పటికీ తమిళ జాలర్ల పరిస్థితి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉందన్నారు. దశాబ్దాలుగా చేపల వేట సాగించే హక్కు కలిగిన ప్రాంతానికి వెళ్ళినా లంక నావికాదళం జాలర్లను అరెస్టు చేస్తోందన్నారు. గత నెల 24వ తేదీ లోక్‌సభలో శ్రీలంక జైళ్ళలో 97 మంది తమిళ జాలర్లు ఉన్నట్టు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడించారని గుర్తు చేశారు. 2024లోనే ఏకంగా 530 మంది జాలర్లను లంక నావికాదళం అరెస్టు చేసిందన్నారు. మంత్రి చెప్పిన లెక్కల ప్రకారం చూస్తే రోజుకు ఇద్దరు చొప్పున జాలర్లను లంక నావికాదళం అరెస్టు చేస్తోందన్నారు. రాష్ట్ర జాలర్లపై జరుగుతున్న దాడులు, అరెస్టులపై ఇప్పటివరకు కేంద్రానికి తాము 74 లేఖలను రాశామని గుర్తు చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతోందని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా భారత్‌కు సొంతమైన కచ్చాదీవును తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్కడ చేపలు వేటాడే హక్కును సొంతం చేసుకోవాలని ఆయన కోరారు. గతంలో కచ్చాదీవును స్వాధీనం చేసుకోవాలని పలుమార్లు అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ కచ్చాదీవుకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపలేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో కొలంబో పర్యటనకు వెళ్ళే ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమస్యకు పరిష్కారం చూపేలా శ్రీలంక పాలకులతో చర్చలు జరిపి, కచ్చాదీవును స్వాధీనం చేసుకోవాలన్నారు.

ఇందిరా గాంధీపై దుష్ప్రచారం : సెల్వపెరుందగై

కచ్చాదీవును శ్రీలంకకు అప్పగించిన వ్యవహారంలో మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే సెల్వపెరుందగై ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చాదీవు అంశంలో వాస్తవాలకు విరుద్ధంగా అనేకమంది సభలో మాట్లాడారన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ద్రోహిగా బీజేపీ ఎమ్మెల్యేలు చిత్రీకరించారన్నారు. కేవలం 285 ఎకరాల స్థలాన్ని శ్రీలంకకు అప్పగించి 6500 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఇందిరా గాంధీ భారత్ వశం చేశారని గుర్తు చేశారు. సభలో మాట్లాడిన కొందరు ఎమ్మెల్యేలు తాము అధికారంలోకి వస్తే ఒక్క జాలరి కూడా దాడికి గురికాదని, జాలర్లపై జరుగుతున్న దాడులను అరికడతామని అప్పట్లో ప్రగల్భాలు పలికారని, కానీ, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ విషయాన్ని మరచిపోయారని బీజేపీ నేతలను ఆయన విమర్శించారు.

కచ్చాదీవి తీర్మానానికి బీజేపీ మద్దతు

అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అన్ని పార్టీలతో పాటు భారతీయ జనతా పార్టీ కూడా మద్దతు తెలిపింది. ఈ తీర్మానంపై ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనపై సీఎం స్టాలిన్ చేసిన ఆరోపణలను ఆమె ఖండించడంతో పాటు ఘాటుగా సమాధానమిచ్చారు. ఆ తర్వాత కచ్చాదీవు స్వాధీనంపై అసెంబ్లీలో చేసిన తీర్మానానికి తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్టు ఆమె ప్రకటించారు.

కులాంతర వివాహానికి సిద్ధమైందని....

సోదరినే చంపేశాడు !

టి.నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో వేరే కులానికి చెందిన యువకుడిని ప్రేమించి. వివాహం చేసుకునేందుకు ప్రయత్నించిన యువతిని హతమార్చిన ఆమె సోదరుడిని పోలీసులు అరెస్టు చేశారు.. వివరాలిలా... తిరుప్పూరు జిల్లా పల్లడం సమీపం పరువాయ్ గ్రామంలో దండపాణికి విద్య (22) అనే కుమార్తె, శరవణకుమార్ (24) అనే కుమారుడు ఉన్నారు. విద్య కోవైలోని ప్రభుత్వ కళాశాలలో ఎంఏ చదువుతోంది. ఆ యువతికి తిరుప్పూరు విజయపురం ప్రాంతానికి చెందిన వెణ్‌మణి (22) అనే యువకుడితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగామారింది. వేరే కులానికి చెందిన యువకుడితో పెళ్ళికి విద్య కుటుంబీకులు అంగీకరించలేదు. ఈ పరిస్థితులలో ఈ నెల 30న విద్య తల్లిదండ్రులు చర్చికి వెళ్లగా, విద్యా ఇంటిలోనే ఉంది. చర్చికి వెళ్ళి ఇంటికి తిరిగొచ్చిన సోదరుడు శరవణన్, తండ్రి దండపాణి ఓ గదిలో విద్య వంటి నిండగా గాయాలతో తలపై బీరువా పడి ఉండగా గమనించి, ఆంబులెన్స్‌కు కబురు చేశారు. ఆంబులెన్స్ సిబ్బంది వచ్చి విద్యను పరీక్షించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆ తర్వాత కుటుంబీకులు యువతికి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వెణ్‌మణి తన ప్రేమికురాలి మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ గ్రామ నిర్వహణాధికారి పూంగొడికి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తహసీల్దార్ శబరగిరి, పోలీసులు విద్య మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు పంపారు. పోస్టుమార్టం రిపోర్టులో బీరువా తలపై పడటం వల్ల విద్య మరణించలేదని, తలపై వేటకొడవలితో కొట్టి హత్య చేసినట్లు వెల్లడైంది. దీంతో కామనాయకన్‌పాళయం పోలీసులు దండపాణి, శరవణకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విద్య వేరే కులానికి చెందిన యువకుడిని ప్రేమించడాన్ని సహించలేక ఆమె సోదరుడు శరవణకుమార్ ఇనుప కమ్మీతో కొట్టి హత్య చేసినట్లు తెలుసుకున్నారు.. పోలీసులు పరువు హత్యకేసుగా నమోదు చేసుకుని శరవణకుమార్‌ను అరెస్టు చేశారు. కాగా ఈ పరువు హత్యను వివిధ పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు.



పరువుహత్యకు గురైన విద్య (ఫైల్‌ఫొటో)



నిందితుడు శరవణకుమార్

నాలుగు కళాశాలల ప్రారంభం

● మంత్రి పీకే శేఖర్‌బాబు



నిర్మాణంలో ఉన్న సీఎండీఏ భవనాలు పరిశీలిస్తున్న మంత్రి శేఖర్ బాబు తదితరలు

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకటించిన 10 కొత్త కళాశాలల్లో నాలుగు మాత్రమే ప్రారంభించినట్లు ఆ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో దేవకోటలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆర్ట్స్ కళాశాల ప్రారంభించే ఆలోచన ఉందా? అని కారైక్కుడి ఎమ్మెల్యే ఎస్.మాంగుడి ప్రశ్నించారు. దీనికి మంత్రి శేఖర్‌బాబు సమాధానమిస్తూ... ద్రావిడ మోడల్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 10 కళాశాలలు ప్రారంభించనున్నట్లు ప్రకటించామన్నారు. కానీ, న్యాయపోరాటాలు, న్యాయస్థానాల్లో కేసుల కారణంగా 4 కళాశాలలు మాత్రమే ప్రారంభించామని తెలిపారు. మిగిలిన ఆరు కళాశాలల ఏర్పాటుకు న్యాయస్థానం పలు నిబంధనలు విధించిందని, వాటిని అధిగమించి త్వరలో ఆ కళాశాలలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే, పెన్నాగరం, తిరుత్తణి సహా పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కళాశాలలు ప్రారంభించాలని కోరారని, ప్రకటించిన కళాశాలలు ఏర్పాటుచేసిన అనంతరం వారి విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

సీఎండీఏ భవనాల పరిశీలన

చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ (సీఎండీఏ) ఆధ్వర్యంలో వాల్ ట్యాక్స్ రోడ్డులో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న భవన నిర్మాణ పనులను మంత్రి శేఖర్‌బాబు బుధవారం పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులను ముగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



జిమ్నాస్టిక్ విజేతలకు నగదు అందజేస్తున్న మంత్రి ఉదయనిధి

క్రీడాకారులతో రాష్ట్రానికి ఘనత

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులతో రాష్ట్రానికి ఘనత చేకూరుతోందని ఉప ముఖ్యమంత్రి, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి కొనియాడారు. సెర్బియా దేశంలో ఈ నెల 4 నుంచి 14వ తేది వరకు జరుగనున్న 15 ఏళ్లలోపు జిమ్నాస్టిక్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొననున్నారు. సచివాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పోటీలకు వెళ్లే ఆరుగురు క్రీడాకారులకు తలా రూ.2.50 లక్షల చొప్పున రూ.15 లక్షలను రవాణా ఖర్చుల కోసం ఉప ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉదయనిధి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, అదనపు నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కోవైలో అంతర్జాతీయ క్రికెట్ మైదానం, ప్రతి జిల్లా కేంద్రంలో స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులకు ప్రోత్సాహక నిధులు కూడా ఇస్తున్నామని, విద్య, ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్ అమలుచేస్తున్నామన్నారు. మరెందరో విద్యార్థులు క్రీడారంగంలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అతుల్ మిశ్రా, క్రీడా అభివృద్ధి కమిషన్ సభ్యుల కార్యదర్శి జె.మేఘనాథరెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన మదురై

సీపీఎం 24వ జాతీయ మహాసభలు ● తరలివస్తున్న వేలాదిమంది కార్యకర్తలు



అమరవీరుల జెండాకు నివాళులర్పిస్తున్న వాసుకి, పద్మనాభన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రకాష్‌కారత్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా తదితరులు

పెరంబూర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) 24వ జాతీయ మహాసభలు మదురై తముక్కం మైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 6వ తేది వరకు జరుగనున్న ఈ మహాసభల్లో కశ్మీర్ నుంచి కన్నియాకుమారి వరకు ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత రాష్ట్రాలకు చెందిన వందలాది మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం తుముక్కం మైదానంలో వేదికపై కేంద్ర కమిటీ సభ్యులు వాసుకి, వెన్మణి అమరవీరుల స్మారక జెండాను సెంట్రల్ కంట్రోల్ కమిటీ చైర్మన్ పద్మనాభన్‌కు అందజేశారు. పార్టీ సీనియర్ నేత బిమన్‌బాసు ఎర్ర జెండా ఎగురవేసి అమరవీరులకు అంజలి ఘటించారు. అనంతరం బాలకృష్ణన్ స్మారక హాలులో పార్టీ మహాసభలు ప్రారంభమయ్యాయి.. మహాసభకు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అధ్యక్షత వహించారు. ఆహ్వాన కమిటీ చైర్మెన్ బాలకృష్ణన్ ఆహ్వానం పలకగా, అఖిల భారత సమన్వయకర్త ప్రకాష్ కారత్ మహాసభలు ప్రారంభించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దిబాంగర్ భట్టాచార్య, ఆర్ఎస్పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ తదితరులు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రసంగించారు. ఈ మహాసభలకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిరువనంతపురం నుంచి రోడ్డు మార్గం గుండా మంగళవారం సాయంత్రం మదురై చేరుకున్నారు. ఆయనకు సీపీఎం కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.



ప్రతినిధులకు రెడ్‌షర్ట్ వలంటీర్ల స్వాగతం

నేడు హాజరుకానున్న సీఎం స్టాలిన్...

మహాసభల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు 'భారత దేశం బలం-సమైక్యవాదం' అనే అంశంపై పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బాలకృష్ణన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరే గౌడ, పార్టీ సమన్వయకర్త ప్రకాష్‌కారత్ ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారు. మహాసభలో విజయ్ సేతుపతి, సముద్రఖని, వెట్రిమారన్, ప్రకాష్ రాజ్, మారి సెల్వరాజ్, జ్ఞానవేల్, శశికుమార్, రాజ్‌మురుగన్ తదితర సినీ ప్రముఖులు పాల్గొననున్నారు. బుధవారం నుంచి ఈ నెల 6వ తేది వరకు జరుగనున్న మహాసభల్లో పాల్గొంటున్న సుమారు వెయ్యి మందికి పైగా ప్రతినిధులు, అంతర్జాతీయ, దేశీయంగా జరుగుతున్న రాజకీయ పరిస్థితులను చర్చించి, భవిష్యత్తు కార్యక్రమాలపై పలు తీర్మానాలు చేయనున్నారు. ఈ మహాసభల్లో పలు విదేశాలకు చెందిన వామపక్ష పార్టీ నేతలు ప్రసంగించనున్నారు. మహాసభలు జరిగే ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

6న భారీ బహిరంగ సభ...

మహాసభ ముగింపురోజున భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు. మదురై పాండి ఆలయం ఎల్కాట్ సమీపం నుంచి చేపట్టనున్న ర్యాలీలో సుమారు 25వేల మంది రెడ్ షర్ట్ వాలంటీర్లు, వారి వెనుకగా 5 లక్షల మంది కార్యకర్తలు పాల్గొననున్నారు. వండియూర్ రింగ్ రోడ్డు టోల్‌గేట్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

సమాచార దర్శిని

సమ్మర్ సీజన్ స్విమ్మింగ్ శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో చెన్నై జిల్లాలో షెనాయ్ నగర్, మెరీనా బీచ్, వేళచ్చేరి తదితర ప్రాంతాల్లో స్విమ్మింగ్ ఫూల్స్ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సమ్మర్ సీజన్ స్విమ్మింగ్ శిక్షణ మంగళవారం ప్రారంభం కాగా 12 రోజులు జరుగనుంది. శిక్షణా ఫీజుగా రూ.2,360 వసూలుచేస్తున్నారు. తదుపరి శిక్షణ ఈ నెల 15-27, 29-మే 11, మే 11-25, మే 27-జూన్ 8వ తేది వరకు జరుగనున్నాయి. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నారు. శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు https://www.sdat.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవాలి. మరిన్ని వివరాలకు 7410703480, 044-26644794 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

5న ఈబీ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈబీ నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక శిబిరాల్లో విద్యుత్ వినియోగదారులు పాల్గొని, విద్యుత్‌కు సంబంధించి సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని ఈబీ విజ్ఞప్తి చేసింది.

ఆంధ్ర కళాస్రవంతి ఆధ్వర్యంలో 6న సీతారామ కల్యాణం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కళాస్రవంతి ఆధ్వర్యంలో.. ఈ నెల 6వ తేదీన సీతారామయ కల్యాణ మహోత్సవం జరుగనుంది. కొరట్టూరు అగ్రహారంలోని రామాలయం వీధిలో జరిగే ఈ ఉత్సవానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేఎం నాయుడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి సీతారామ భజన కార్యక్రమం వుంటుంది.

ఉత్తర చెన్నైలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ఉత్తర చెన్నై ప్రజల సౌకర్యార్థం పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు లేఖ రాశారు. ఈ విషయమై స్పందించిన కేంద్రమంత్రి జయశంకర్.. ఉత్తర చెన్నై తపాలా కార్యాలయంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేసే అంశం పరిశీలనలో ఉందని, పెరియార్ నగర్ ప్రాంతంలో ఉన్న తపాలా కార్యాలయంలో సేవా కేంద్రం ఏర్పాటుకు తగిన స్థలం అందించాలని తపాలా శాఖను కోరినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

'నీట్' శిక్షణ కేంద్రాలు ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు విద్యా జిల్లాలో ఐదు ప్రాంతాల్లో 'నీట్' శిక్షణా కేంద్రాలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ తెలిపారు. వైద్య కోర్సుల్లో చేరేందుకు జాతీయస్థాయి అర్హత పరీక్ష 'నీట్‌లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. నీట్‌కు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణ అందజేస్తోంది. అచ్చిరుపాక్కం, మధురాంతకం, సెయ్యూరు, చెంగల్పట్టు, పల్లావరం ప్రాంతాల్లోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో నీట్ శిక్షణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. శిక్షణకు 401 మంది విద్యార్థులు పేర్లు నమోదుచేసుకున్నారు నీట్ సంబంధిత పుస్తకాలు అందజేయడంతో పాటు ప్రతి శనివారం మోడల్ పరీక్ష నిర్వహించనున్నారు.

మారథాన్ పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలను పురస్కరించుకొని తిరువళ్లూర్ జిల్లాలో ఈ నెల 6న మారథాన్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న మారథాన్‌లో 16-35 ఏళ్ల లోపున్న వారు పాల్గొనవచ్చు. మారథాన్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ, యువకులు ఆధార్ కార్డు నకలు, మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలి. మొదటి ఐదు స్థానాల్లో నిలిచే పురుషులు, మహిళలకు తలా రూ.10వేల బహుమతిగా అందజేయనున్నారు. వివరాలకు 7401 703 482, 8072908634 అనే నెంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 1.17 లక్షల మంది అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్ పేజీలో... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26వ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల అడ్మిషన్లను గత నెల 1వ తేది నగరంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. అడ్మిషన్లు ప్రారంభమైన నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1వ తరగతిలో 1,05,286 మంది సహా కిండర్ గార్డెన్, ఇతర తరగతుల్లో మొత్తం 1,17,310 మంది విద్యార్థులు చేరారు. అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని, విద్య సహాయంతో ప్రపంచాన్ని జయించడానికి మన ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ పునాది అని మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్‌లో పేర్కొన్నారు.

నగరానికి చేరుకున్న 13 మంది జాలర్లు

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి 13 మంది జాలర్లు నగరానికి సురక్షితంగా చేరుకున్నారు. రామేశ్వరానికి చెందిన ముగ్గురు జాలర్లు గత నెల 19వ తేదీన, ఫిబ్రవరి నెల 23వ తేదీ పది మంది జాలర్లు రెండు మరబోట్లలో సముద్రంలోని చేపల వేటకు వెళ్లారు. ఈ 13 మందిని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. ఈ జాలర్ల విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసింది. దీంతో దేశ విదేశాంగ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంతో 13 మంది జాలర్లను శ్రీలంక విడుదల చేసింది. వీరంతా కొలంబో నుంచి చెన్నై విమానంలో రాగా, వారికి మత్స్య శాఖ అధికారులు స్వాగతం పలికి వారివారి సొంతూర్లకు అధికారులు పంపించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం 206 ప్రత్యేక విమానాలు

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానాలు నడుపనున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. వేసవి సెలవుల సందర్భంగా స్వదేశీ, విదేశాలకు వెళ్లే వారి సంఖ్య మరింత పెరగనుంది. ప్రయాణికుల సౌకర్యార్థం నగరం నుంచి అదనంగా 42 అంతర్జాతీయ విమానాలు, 164 స్వదేశీ విమానాలు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం

● మరో నలుగురికి గాయాలు

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తైయూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలవ్వగా, మరో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... స్థానిక కేళంబాక్కం సమీపంలోని పాలమా నగర్‌కు చెందిన హరిదాస్ (35) ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఆయన భార్య సుగంధి (33), కుమారులు లియోడేనియేల్ (10), జో డేనియేల్ (5)తో కలసి మంగళవారం సాయంత్రం తిరుపోరూర్ సమీపం కాయార్ గ్రామంలోని మామ ఇంట్లో జరిగే శుభకార్యానికి మోటారు సైకిల్‌పై వెళ్లాడు. కార్యక్రమం అనంతరం రాత్రి 11 గంటల ప్రాంతంలో హరిదాస్ తిరుగు ప్రయాణమయ్యాడు. తైయూర్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో హరిదాస్, సుగంధి, కుమారుడు లియో డేనియేల్ అక్కడికక్కడే మృతిచెందగా, జో డేనియేల్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కాయార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కాయార్ గ్రామానికి చెందిన అశ్విన్ కుమార్, ఆయన భార్య బిందు, కుమారుడు అభినేష్ పాల్మనికి గాయాలయ్యాయి. వీరితో పాటు గాయపడిన జోడేనియేల్‌ను ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదానికి కారణమైన కారు

కోవై జిల్లాకు నిరంతరాయంగా తాగునీరు

● మంత్రి కేఎన్ నెహ్రూ

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లాకు నిరంతరాయంగా తాగునీరందించేలా చర్యలు చేపడతామని మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కినత్తుకడవు ఎమ్మెల్యే దామోదరన్ మాట్లాడుతూ... పొల్లాచ్చి నియోజకవర్గం పాలక్కరై ప్రాంతం కొత్త కాలనీలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తెలిపారు. ఇందుకు మంత్రి కేఎన్ నెహ్రూ సమాధానమిస్తూ... కోవై జిల్లాకు 380 ఎంఎల్డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని, అయినా ఇంకా కొరత ఉందని సభ్యులు చెబుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో స్థానిక సంస్థల అధికారులు, తాగునీటి సరఫరా శాఖ కార్యదర్శితో సమావేశం నిర్వహించి, జిల్లాలో అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

ఎంజీఆర్ తొలి అభిమాని ముఖ్యమంత్రి స్టాలిన్

● మంత్రి ఏవీ వేలు

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి, నటుడు ఎంజీఆర్‌కు తొలి అభిమాని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అని మంత్రి ఏవీ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో మంగళవారం ఓ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి ఏవీ వేలు సమాధానం చెబుతూ... సీఎం స్టాలిన్ కారులో వెళ్లే సమయంలో ఎంజీఆర్ పాటలే వింటుంటారన్నారు. తన చిత్రం విడుదలైన రోజున 'ఎలా ఉంది' అంటూ ఎంజీఆర్ మొదట స్టాలిన్‌ను అడిగేవారన్నారు. రష్యా సంస్కృతి, సంప్రదాయాలు,చ భాషా పరిరక్షణకు పోరాడిన యోధుడు జోసఫ్ స్టాలిన్ అని, ఆ దేశ ప్రజలు ఆయనను ఉక్కు మనిషిగా పిలుస్తారని, తమ మాతృభాష తమిళంను కాపాడేందుకు పోరాట గళం విప్పుతున్న తమిళనాడు ఉక్కు మనిషి ముఖ్యమంత్రి స్టాలిన్ అని మంత్రి తెలిపారు.

ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాలపై అభిమానుల అసంతృప్తి

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ పోటీల్లో భాగంగా చేపాక్కం మైదానంలో ఈ నెల 5వ తేది చెన్నై సూపర్ కింగ్స్-ఢిల్లీ డేర్‌డెవిల్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు బుధవారం ఉదయం 10.15 గంటలకు ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే 'సోల్డ్ అవుట్' అనే మెసేజ్ చూసి అభిమానులు ఖంగుతిన్నారు. టిక్కెట్ల కోసం 10 గంటల నుంచే సుమారు 3 లక్షల మంది వేచి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదుకాగా, కొద్ది నిమిషాల్లో టిక్కెట్ల అయిపోయాయని మెసేజ్ రావడంపై అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకొని అదనపు విక్రయాలు పాల్పడుతున్నారని, ఐపీఎల్ టిక్కెట్ల విక్రయాలు నియంత్రించేలా చర్యలు చేపట్టాలని అభిమానులు కోరుతున్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు


తిరుత్తణి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి డీఎంకే ఆధ్వర్యంలో పల్లిపట్టు సమీపంలోని అధిమాంజేరిపేటలో చలివేంద్రాన్ని తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీసేన, లోకనాథం, కుమరేశన్, మణికందన్, వీవీ.మణి, దేవరాజన్, శివకుమార్, రాజేంద్రన్, ధనవేల్, మణి తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకేతో కూటమి వద్దు

అన్నామలై కావాలి...!

● రామనాథపురంలో వెలసిన పోస్టర్లు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై కావాలి, అన్నాడీఎంకేతో కూటమి వద్దంటూ రామనాథపురంలో అంటించిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీ కూటమిపై ఢిల్లీ స్థాయిలో మంతనాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైను ఈ పదవి నుంచి తప్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, రామనాధపురం బీజేపీ జిల్లా కార్యదర్శి, మేల్‌కొడుమలూరు పంచాయతి యూనియన్ అధ్యక్షుడు సెయ్యామంగళం కె.శరవణన్ పేరుతో పరమకుడిలో వెలిసిన వాల్‌పోస్టర్లలో... 'వేండుమ్...వేండుమ్... రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నామలై వేండుమ్... వేండామ్... వేండామ్, అన్నాడీఎంకేతో కూటని వేండామ్.... అంటూ ముద్రించారు.



పరమకుడిలో వెలిసిన పోస్టర్

ప్రధాని మోదీ పాంబన్ పర్యటన ఎఫెక్ట్

● 3 రోజులు చేపలవేట నిషేధం

టి.నగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 6న పాంబన్ వద్ద కొత్తగా నిర్మించిన రైలు వంతెన ప్రారంభించేందుకు రానుండటంతో జాలర్లు మూడు రోజులపాటు చేపలవేటకు వెళ్ళకూడదంటూ భద్రతా విభాగం, మత్స్య శాఖ ఉన్నతాధికారులు ఆంక్షలు విధించారు. రామేశ్వరం, పాంబన్, మండపం తదితర ప్రాంతాల నుండి ఈ నెల 4నుండి 6వరకు జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా నిషేధించారు.ఇక పాంబన్ రైలు వంతెనకు సమీపంలో నిలిపిన మరపడవలను కుందుకాల్ రేవుకు తరలించాలని, నాటు పడవలను తంగచ్చిమటం ప్రాంతానికి తరలించాలని జాలర్లకు సూచించారు.కొత్తపాంబన్ రైలువంతెన ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీతోపాటు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. దీనితో బుధవారం ఉదయం నుండే పాంబన్ రైలు వంతెన వద్ద సాయుధ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.. మోదీ తన పర్యటనలో భాగంగా పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామివారిని దర్శించనుండటంతో ఆ ఆలయం వద్ద కూడా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

లారీ డ్రైవర్ వద్ద దోపిడీ వ్యవహారం...

ఎన్‌కౌంటర్‌లో రౌడీ విజయ్ హతం

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ల వద్ద నగదు దోచుకుంటున్న రౌడీ విజయ్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. పుదుచ్చేరి-నాగపట్టణం జాతీయ రహదారిపై ప్రతిరోజు వందలాది సరుకు వాహనాలు వెళ్తుంటాయి. ఎం.పుదూర్ ప్రాంతంలో వాహనాలను అడ్డుకుంటున్న ఓ ముఠా డ్రైవర్ల నుంచి మామూళ్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి నుంచి మైలాడుదురై వెళ్తున్న లారీని అడ్డుకొని, డ్రైవర్ కాళిముత్తుపై కత్తితో దాడి చేసి సెల్‌ఫోన్, నగదు దోచుకున్న ఓ ముఠా పరారైంది. అలాగే, మరో లారీ డ్రైవర్ మణిమారన్‌పై కూడా ఆ ముఠా కత్తితో దాడిచేసి నగదుతో ఉడాయించారు. ఈ ఘటనల్లో గాయపడిన ఇద్దరు డ్రైవర్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన ముఠా కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో, కడలూరు జిల్లాలో డ్రైవర్లపై కత్తితో దాడిచేసిన వారిలో విజయ్ అలియాస్ ముట్టై విజయ్ ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి అతడిని చుట్టుముట్టారు. విజయ్ కత్తితో పోలీసులతో దాడిచేయడంతో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. ఆ తర్వాత కూడా విజయ్ కత్తితో బెదిరిస్తూ పారిపోయేందుకు యత్నించడంతో, పోలీసుల కాల్పుల్లో అతను మృతిచెందాడు. మృతుడు విజయ్‌పై పుదుచ్చేరి, కడలూరు, విల్లుపురం తదితర జిల్లాల్లో హత్యాయత్నం, దోపిడీ సహా 30కి పైగా కేసులున్నాయి. అలాగే, ఈ వ్యవహారంలో పోలీసులు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.



హతుడు విజయ్ (ఫైల్ ఫొటో)

ఈ-పాస్ రద్దు చేయాలంటూ బంద్

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీలో పర్యాటక వాహనాలకు అమలు చేస్తున్న ఈ-పాస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నీలగిరి జిల్లాలో వ్యాపారులు ఒక రోజు బంద్ పాటించారు. మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ-పాస్ విధానం అమలు చేస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ఊటీ వైపు వెళ్ళే వాహనాలను తనిఖీ చేస్తూ, ఈ-పాస్ ఉన్న వాటినే మాత్రమే అనుమతిస్తున్నారు. అయితే, ఈ-పాస్ విధానాన్ని రద్దు చేయాలని స్థానిక వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని పర్యాటక అధికారులు చెబుతున్నారు. ఈ విధానం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ-పాస్ విధానాన్ని రద్దు చేయాలని బుధవారం నీలగిరి జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించారు. ఊటీ, కున్నూరు, కూడలూరు ప్రాంతాల్లోని అన్ని వ్యాపార సంస్థలు మూతపడ్డాయి.

పట్టా మార్చేందుకు రూ.5 వేల లంచం

వీఏవో అరెస్ట్

ఐసిఎఫ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో పట్టా మార్పునకు రూ.5 వేలు లంచం తీసుకున్న వీఏఓను అవినీతి నిరోధక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉడయాంతాంగళ్ ప్రాంతానికి చెందిన సుభాష్, పట్టా మార్పు కోరుతూ తరక్కోరి గ్రామ నిర్వహణాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు రూ.5 వేలు లంచం ఇవ్వాలని వీఏఓ తిరునావుక్కరసు డిమాండ్ చేశాడు. లంచం ఇచ్చేందుకు అంగీకరించని సుభాష్ ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారుల సూచనల మేరకు సుభాష్ రసాయనాలు పూసిన నోట్లను వీఏఓ తిరునావుక్కరసుకు అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

సాంకేతికలోపంతో లండన్ విమానం రద్దు

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతికలోపం సకాలంలో గుర్తించడంతో 220 ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మీనంబాక్కం విమానాశ్రయం నుంచి బుధవారం తెల్లవారుజామున 5.35 గంటలకు లండన్ వెళ్లాల్సిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం సిద్ధంగా ఉంది. విమానంలో 206 ప్రయాణికులు, 14 మంది సిబ్బంది ఉన్నారు. విమానంలో ప్రయాణికులను అనుమతించేందుకు ముందు యంత్రం పనితీరు అధికారులు పరిశీలించారు. ఆ సమయంలో యంత్రంలో సాంకేతికలోపాన్ని గుర్తించారు. నిపుణులు సాంకేతికలోపం సరిచేసేందుకు యత్నించగా సాధ్యం కాలేదు. దీంతో, విమానం రద్దు చేసినట్లు ప్రకటించిన అధికారులు, ప్రయాణికులను నగరంలోని వివిధ స్టార్ హోటళ్లకు తరలించారు.

అయోధ్యకు 60 వేల కుంకుమ ప్యాకెట్లు

● పంపించిన కంచి ఆలయ అధికారులు

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలరాముడి ఆలయానికి (అయోధ్య రామాలయం)కు కాంచీపురం కామాక్షి అమ్మన్ ఆలయ అధికారుల నుంచి 60 వేల కుంకుమ, విభూతి ప్యాకెట్లను పంపించారు. శంకరాచార్య అనుగ్రహం మేరకు వీటిని పంపించినట్లు కంచి కామాక్షి ఆలయ శ్రీకార్యం సుందరేశ అయ్యర్ తెలిపారు. అలాగే వేసవిలో కామాక్షి ఆలయానికి, శంకర మఠాన్ని వచ్చే భక్తుల సౌకర్యార్థ చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఆలయంలో వసంత నవరాత్రి వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10 మంది గంటల నుంచి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తామని వెల్లడించారు.

ప్రియురాలిని కొట్టి చంపిన లారీ డ్రైవర్

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలో చెన్నై కార్పొరేషన్‌కు చెందిన లారీ డ్రైవర్ ఒకరు తన ప్రియురాలిని కొట్టి చంపేశాడు. తనతో కొనసాగుతున్న వివాహేతర సంబంధాన్ని వదులుకోవడం జీర్ణించుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.... పల్లావరం సమీపంలోని అనకాపుత్తూరు అరుళ్ నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి (33) అనే వివాహిత భర్తకు విడాకులు ఇచ్చి ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటోంది. ఆమెకు అనకాపుత్తూరుకు చెందిన జ్ఞానసిద్ధన్ అనే లారీ డ్రైవర్ పరిచయమయ్యాడు. ఇతడు అవివాహితుడు కావడంతో వారి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. అయితే, కొన్ని రోజుల నుంచి జ్ఞానసిద్ధన్‌ను భాగ్యలక్ష్మి దూరం పెట్టి మరో వ్యక్తితో మాట్లాడటం ప్రారంభించింది. ఈ విషయం తెలుసుకున్న జ్ఞానసిద్ధన్ ఆమెతో గొడవకు దిగాడు. మంగళవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్ళి, భాగ్యలక్ష్మితో కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. ఆ తర్వాత వారిద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో జ్ఞానసిద్ధన్ పక్కనే ఉన్న బండరాయితో భాగ్యలక్ష్మి తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడే ప్రాణాలు విడిచింది. దీంతో భయపడిన జ్ఞానసిద్ధన్ నేరుగా శంకర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి లొంగిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపించారు.

ఆన్‌లైన్ రమ్మీలో రూ.10 లక్షల నష్టం

● రైలు కింద పడి బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రీడల్లో భారీగా నగదు కోల్పోయిన బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తిరుచ్చి జిల్లా బిడార మంగళం ప్రాంతానికి చెందిన జయకుమార్ (37) ఈరోడ్ జిల్లా ముత్తూరులో కరూర్ వైశ్యా బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కవిత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొద్ది నెలలుగా ఆన్‌లైన్ రమ్మీకి ఆడుతున్న జయకుమార్, సుమారు రూ.10 లక్షలకు పైగా డబ్బు పోగొట్టుకున్నట్లు సమాచారం. అలాగే, రూ.2 లక్షలు కావాలని భార్య కవితను ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో, నామక్కల్ జిల్లా నెయికారన్‌పట్టిలోని బంధువుల ఇంటికి సోమవారం వచ్చిన జయకుమార్, అక్కడ ఆత్మహత్యకు యత్నించగా బంధువులు అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో, మంగళవారం సాయంత్రం తన బైక్‌పై నెయికారన్‌పట్టి సమీపంలోని రైలుపట్టాల వద్దకు వచ్చి బైక్ పార్కింగ్ చేసి, ఆ సమయంలో అటు వైపు వచ్చిన సేలం-మైలాడుదురై ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సేలం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విమానాశ్రయంలో పాత నేరస్తుడి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): షార్జా నుంచి నగరానికి వచ్చిన విమానంలో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువారూర్ జిల్లా గుడివాసల్ ప్రాంతానికి చెందిన అరవింద్‌పై 2021లో ఓ చోరీ కేసు నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో అతడిని అరెస్ట్ చేసేందుకు యత్నించగా తప్పించుకొని విదేశాలకు పారిపోయినట్లు తెలిసింది. దీంతో, అతడిని వెతుకుతున్న నిందితుడిగా పోలీసులు ప్రకటించారు. ఈ క్రమంలో, మంగళవారం షార్జా నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన అరవింద్‌ను గుర్తించిన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని అతనిని అదుపులోకి తీసుకొని తిరువారూరు తరలించారు.

స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐపై హత్యాయత్నం

● ముగ్గురి అరెస్ట్, 500 కిలోల గుట్కా స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మేచ్చేరి ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టిన స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐని కారుతో హతమార్చేందుకు యత్నించిన గుట్కా ముఠాకు చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లా మేచ్చేరి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక ఎస్ఐగా పనిచేస్తున్న గోవిందరాజన్ (54) మంగళవారం సాయంత్రం మేచ్చేరి-ధర్మపురి రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తోప్పూర్ వైపు నుంచి వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా, వారు ఆపకుండా ఎస్ఎస్ఐను ఢీకొట్టి వెళ్లిపోయారు.. ఈ విషయాన్ని అక్కడున్న పోలీసులు మేచ్చేరి పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయగా, పోలీసులు మరో వాహనంలో వెంబడించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారు అందించిన సమాచారంతో మరో కారును అదుపులోకి తీసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన తేజోరామ్(33), దేవారామ్(23), మేచ్చేరి ప్రాంతానికి చెందిన స్వామినాథన్ (35) అని తెలిసింది. వారిలో తేజోరామ్ ఇదివరకే గుట్కా అక్రమ తరలింపు కేసులో అరెస్టయి బెయిలుపై విడుదలై మళ్లీ గుట్కా తరలిస్తున్నట్లు విచారణలో తెలిసింది. ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు, రెండు కార్లలో ఉన్న రూ.3.5 లక్షల విలువైన 500 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు.

వంటగ్యాస్ లీకై 20 పూరిళ్లు దగ్ధం



టి.నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా మేల్‌తెరుపేటలో బుధవారం వేకువజాము ఓ ఇంటిలో వంటగ్యాస్‌లీక్ కావటంతో సంభవించిన అగ్ని ప్రమాదంలో 20 గుడిసెలు దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న రాజా అనే వ్యక్తికి చెందిన ఇంటిలో వంటగ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఆ ఇంటిలోని వస్తువులకు నిప్పంటుకున్నాయి. దీంతో ఇంటిలోని వారంతా నిద్ర నుంచి లేచి బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో గాలి బలంగా వీయడంతో చుట్టుపక్కల గుడిసెలకు కూడా నిప్పంటుకుంది. సమాచారం అందటంతో అగ్నిమాపక దళం, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం

● మద్యం సీసా పొట్టలో దిగి విద్యార్థి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దాచిన మద్యం బాటిల్ పొట్టలో దిగబడి విద్యార్థి మృతిచెందిన ఘటన రామనాథపురంలో మంగళవారం చోటుచేసుకుంది. రామనాథపురం ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల విద్యార్థి తన 17 ఏళ్ల స్నేహితుడితో కలసి మోటార్‌బైక్‌పై రామనాథపురం బీచ్ సమీపంలోని టాస్మాక్ దుకాణానికి వెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. ఆ మద్యం బాటిళ్లను ఆ విద్యార్థి తన పొట్ట దిగువ దాచి, మోటారు సైకిల్ వెనుక కూర్చున్నాడు. తొరవళ్లూర్ ప్రాంతంలో ఎదురుగా వస్తున్న లోడు వాహనాన్ని వీరి బైక్ ఢీకొనడంతో, ఇద్దరు బైక్ నుంచి కిందపడ్డారు. విద్యార్థి దాచిన మద్యం బాటిళ్లు పగిలి గాజు పెంకులు పొట్టలో దిగబడ్డాయి.. బైక్ నడుపుతున్న మరో యువకుడికి కూడా గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని రక్షించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటనపై రామనాథపురం బజార్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బకు ఒకరి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో వడదెబ్బకు ఓ వ్యక్తి మృతి చెందాడు. మూలకరైపట్టి చింతామణి వీధికి చెందిన గణేశన్ (55) హోటల్ నడుపుతున్నాడు. ఆధార్ కార్డు కోసం వేలిముద్రలు నమోదుచేసేందుకు గణేశన్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని ఈ-సేవా కేంద్రానికి వచ్చాడు. తిరునల్వేలి పట్టణంలో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. మధ్యాహ్నం ఈ-సేవా కేంద్రం వద్ద నిల్చున్న గణేశన్ హఠాత్తుగా స్పృహతప్పి కిందపడ్డాడు. చుట్టుపక్కల వారు అతడి ముఖంపై నీరు చల్లినా ఎలాంటి స్పందన లేదు. దీంతో, ఆయనను ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను పిలిపించగా, పరీక్షించిన వైద్య సిబ్బంది, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గణేశన్ వడదెబ్బకు మృతిచెందాడా? మరేదైనా అనారోగ్యం కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు...

హెచ్ఎంపై పోక్సో కేసు

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. విరుదునగర్ జిల్లాలోని ఓ పంచాయతి యూనియన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొద్ది రోజుల క్రితం 7వ తరగతి విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. దీనిపై ఓ విద్యార్థిని తల్లి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. అనంతరం లైంగిక వేధింపులపై బాధిత విద్యార్థులు 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారి ఫిర్యాదుతో సాత్తూర్ పోలీసులు, పోక్సో చట్టంపై కేసు నమోదుచేశారు.

నేడు, శనివారం పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలో పలు రైళ్లను గురువారం, శనివారం రద్దు చేస్తున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. కొద్దిరోజులుగా కవరేపేట-పొన్నేరి మధ్య సిగ్నలింగ్ వ్యవస్థ, రైలు పట్టాల మార్పులు జరుగుతున్నాయి. గురువారం, శనివారం మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆ రెండు రోజుల్లో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేశారు. సూళ్లూరుపేట-చెన్నై మధ్య ఉదయం 5.40, మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 గంటలకు నడిచే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దుచేశారు. మరికొన్ని రైళ్లను పొన్నేరి-గుమ్మిడిపూడి మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

నేడు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ట్రైలర్ రిలీజ్!


అజిత్

ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అగ్రహీరో అజిత్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తమిళం, తెలుగు తదితర భాషల్లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీత స్వరాలు సమకూర్చారు. అయితే, ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ట్రైలర్, ఆడియోను ఎపుడు విడుదల చేస్తారనే ఆసక్తి అజిత్ అభిమానుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ రిలీజ్‌కు సంబంధించి మేకర్స్ వర్గాలు ఓ న్యూస్ లీక్ చేశాయి. ఈ నెల 10వ తేదీన మూవీ రిలీజ్‌కు సిద్ధమైన నేపథ్యంలో ట్రైలర్‌ను గురువారం విడుదల చేయొచ్చని సూచన ప్రాయంగా వెల్లడించాయి. ఇందులో త్రిష హీరోయిన్‌గా నటించగా, సునీల్, అర్జున్ దాస్, రాహుల్ దేవ్, ప్రసన్న, ప్రభు, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

నటి స్నేహ దంపతులపై
భక్తుల ఆగ్రహం


స్నేహ - ప్రసన్న

ఇటీవల ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరువణ్ణామలై వెళ్ళిన నటి స్నేహ - ప్రసన్న దంపతులు స్వామివారిని దర్శనం చేసుకుని గిరిప్రదక్షిణ చేశారు. అయితే వారు కాళ్ళకు చెప్పులు వేసుకుని గిరిప్రదక్షిణ పూర్తి చేయడాన్ని భక్తులు తీవ్రంగా ఖండిస్తున్నారు. చెప్పులు వేసుకుని గిరిప్రదక్షిణ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఒకప్పుడు దక్షిణాది చిత్రసీమలో అగ్రనటిగా కొనసాగిన స్నేహ... 2012లో నటుడు ప్రసన్నను వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైన స్నేహ.. ఇపుడు పిల్లలు పెరిగిపెద్దవారు కావడంతో మళ్ళీ సినిమాల్లో రీఎంట్రీ ఇచ్చారు. టీవీ సీరియల్స్, వెబ్ సిరీస్, వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూనే, సినిమాల్లో వచ్చే అక్క, వదిన, తల్లి పాత్రలను పోషిస్తున్నారు. ఇటీవల విజయ్ నటించిన 'ది గోట్' మూవీలోనూ ఆమె నటించారు. ఇదిలావుంటే, గతవారం తిరువణ్ణామలైకు వెళ్ళి స్నేహ దంపతులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత గిరిప్రదక్షిణ చేశారు. ఆ సమయంలో ఆమెతో అనేక మంది భక్తులతో పాటు స్థానికులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో ఎలక్ట్రానిక్ మీడియాలో వైరల్ అయింది. అయితే, గిరిప్రదక్షిణ సమయంలో వారు చెప్పులు ధరించి వుండటాన్ని పలువురు భక్తులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. భక్తిభావం ఎక్కువగా ఉండే స్నేహ... కోట్లాదిమంది ఎంతో భక్తిశ్రద్ధలతో చేసే గిరిప్రదక్షిణ చెప్పులు ధరించి ఎలా చేస్తారంటూ నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. అయితే, స్నేహ దంపతులు మాత్రం సైలెంట్‌గా ఉన్నారు.

తమిళ చిత్రజ్యోతి



నా బ్యూటీ సీక్రెట్ ఇదే

● కయదు లోహర్

తన బ్యూటీ సీక్రెట్‌ను హీరోయిన్ కయదు లోహర్ వెల్లడించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ప్రతి రోజు వేకువజామునే నిద్రలేస్తాను. ఆ తర్వాత కనీసం గంట యోగా చేస్తాను. ఆ తరువాత అర్థగంట పాటు స్ట్రెచ్చింగ్, గంటపాటు వాకింగ్ చేస్తాను. ఆ సమయంలో ఎవరితోనూ మాట్లాడను. అనవసరమైన విషయాలను పట్టించుకోను. ఆందోళన చెందను. మనసు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా ఆలకిస్తాను. అలాగే, మనం చెప్పే ప్రతి విషయాన్ని మనసు వింటుంది. అపుడే ఎల్లవేళలా ప్రశాంతంగా ఉండగలం' అంటూ ఆమె తన బ్యూటీ వెనుక ఉన్న రహస్యాన్ని వెల్లడించింది. ఇదిలావుంటే 'ఓ మై కడవులే' ఫేం అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన 'డ్రాగన్' మూవీలో హీరో ప్రదీప్ రంగనాథన్ ప్రియురాలి పాత్రలో నటించి, నేటితరం యువతను ఫిదా చేశారు. అలాగే, తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో వరుస అవకాశాలు దక్కించుకుంటూ తన సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

18న సిబిరాజ్ 'టెన్ అవర్స్' రిలీజ్

యువనటుడు సిబిరాజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'టెన్ అవర్స్' ఈ నెల 18వ తేదీ విడుదలకానుంది. నిజానికి ఈ మూవీని గత సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేయగా, వాణిజ్యపరమైన చిక్కులు తలెత్తడంతో విడుదల వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని మేకర్స్ ప్రకటించారు. కాగా, ఈ సినిమాకు సంబంధించి రెండు ట్రైలర్స్ రిలీజ్ చేయగా, రెండో ట్రైలర్‌కు ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి బ్యాక్‌గ్రౌండ్ వాయిస్ ఇచ్చారు. ఒక రాత్రి ప్రయాణంలో బస్సులో జరిగే హత్య, ఆ హత్య వెనుక ఉన్న మర్మాన్ని ఛేదించే ఇతివృత్తంతో నూతన దర్శకుడు ఇళయరాజా కలియపెరుమాళ్ రూపొందించారు. ఫుల్‌లెంగ్త్ థ్రిల్లర్ జానర్‌లో డువిన్ స్టూడియోస్ నిర్మించగా, ఫైవ్‌స్టార్ సెంథిల్ రిలీజ్ చేస్తున్నారు.

'టెన్ అవర్స్'లో సిబిరాజ్




ఎంఐ 17 రకం హెలికాప్టర్

ప్రధాని పాంబన్ పర్యటన కోసం
శ్రీలంకలో 4 హెలికాప్టర్లు సిద్ధం

టి.నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలోని పాంబన్ కొత్త రైలు వంతెన ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోదీని శ్రీలంక నుండి పాంబన్‌కు చేర్చేందుకు భారత వైమానికదళానికి చెందిన ఎంఐ 17 రకానికి చెందిన నాలుగు హెలికాప్టర్లను సిద్ధంచేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 4, 5 తేదీల్లో శ్రీలంకలో పర్యటించనున్నారు. ఆ పర్యటనను ముగించుకుని ఈ నెల 6న హెలికాప్టర్‌లో బయలుదేరి రామేశ్వరం సమీపం మండపం ప్రాంతంలోని హెలిపాడ్‌లో దిగుతారు. శ్రీలంక నుండి మోదీని తీసుకొచ్చేందుకు కోయంబత్తూరు సూలూరులో ఉన్న భారత వైమానిక దళానికి చెందిన ఎంఐ 17 రకానికి చెందిన నాలుగు హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నారు. ఆ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఉచ్చిపుల్లి ప్రాంతానికి చేరుకున్న ఎంఐ 17 రకం హెలికాప్టర్లు అక్కడి నుండి శ్రీలంకలోని కాట్టునాయకె విమానాశ్రయానికి వెళ్ళాయి. పాంబన్ వంతెన ప్రారంభోత్సవం జరుగనున్న ఈ నెల 6న కాట్టునాయకె విమానాశ్రయం నుండి ఆ నాలుగు హెలికాప్టర్లు అనురాధపురం ప్రాంతంలో ఉన్న శ్రీలంక వైమానికదళం హెలిపాడ్ ప్రాంతానికి వెళ్తాయి. ఆ రోజు ఉదయం 10.40 గంటలకు అనురాధపురం వైమానికదళం హెలిపాడ్ నుండి మోదీ హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.40 గంటలకు పాంబన్ సమీపంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. ఈ ఏర్పాట్లన్నీ ఢిల్లీ నుండి వచ్చిన ప్రధాని ప్రత్యేక భద్రతా విభాగానికి చెందిన ఉన్నతాధికారులు చేపడుతున్నారు.

మన్నార్గుడిలో నేత్రపర్వంగా
'వెన్నై తాయ్' ఉత్సవం

వెన్న ముద్దలు చల్లి పరవశించిన భక్తజనం

టి.నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు జిల్లా మన్నార్గుడి రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 'వెన్నై తాయ్' ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. సుప్రసిద్ధ వైష్ణవ దివ్యదేశాల్లో ఒకటైన ఈ ఆలయంలోని పెరుమాళ్ సన్నిధిలో పరవాసుదేవ పెరుమాళ్ కొలువుదీరి ఉన్నారు. ఉత్సవమూర్తిగా రాజగోపాలస్వామి రుక్మిణీ సత్యభామ సమేతుడై 'గోవుల గోపన్న' రూపంలో, సెంగమల తాయార్ ప్రత్యేక సన్నిధిలోనూ పూజలందుకుంటున్నారు. ఈ ఆలయంలో ప్రతియేటా పంగుణి ఉత్సవాలు నెల రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆ మేరకు ఈ యేడాది పంగుణి ఉత్సవాలు మార్చి 18న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రెండు వారాలుగా స్వామివారు ప్రతిరోజే విశేషాలంకరణలో వివిధ వాహనాల్లో ఊరేగారు. ఈ వేడుకలలో ముఖ్యమైన వెన్నై తాయ్ ఉత్సవం బుధవారం ఉదయం ప్రారంభమైంది. నవనీత సేవను స్వీకరించిన రాజగోపాల స్వామివారిని పల్లకీలో ఉంచి ఆలయం నుండి బయలుదేరి చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ సందర్భంగా ప్రతివీధిలోనూ వేలాదిమంది భక్తులు స్వామివారి పల్లకీపై వెన్న ముద్దలు విసిరారు. స్వామివారు చివరగా గాంధీరోడ్డులోని వెన్నై తాయ్ మండపంలో ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత బుధవారం రాత్రి స్వామివారు అశ్వవాహనంలో రాజ అలంకారంలో ఊరేగారు.. ఈ ఉత్సవాలలో ప్రధానఘట్టమైన రథోత్సవం గురువారం ఉదయం జరుగనుంది.


భక్తులు విసిరిన వెన్నెముద్దల వర్షంలో తడిసిముద్దయి పల్లకీలో ఊరేగుతున్న చిన్నికృష్ణుడు

మహిళా సాధకులకు 'సూర్య మగల్' అవార్డులు


అవార్డు గ్రహీతలతో నేతలు

✳ అందజేసిన సత్యరాజ్, ప్రభు

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాలో ప్రతిభ కనబరిచిన మహిళలను 'సూర్య మగల్' అవార్డుతో నగర మేయర్ ఆర్.ప్రియ సత్కరించారు. ప్యారీస్‌లోని రాజా అన్నామలై మండ్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో నగర మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షత వహించగా, సినీ నటులు సత్యరాజ్, ప్రభుతో పాటు సీఎం సతీమణి దుర్గా స్టాలిన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇందులో సినీ నేపథ్యగాయని పి.సుశీల, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి మాల, అగ్నిమాపకదళ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ ప్రియా రవిచంద్రన్, ప్రముఖ రచయిత శివశంకరి, తమిళ పండితురాలు నంబి ఆరూన్, అపోలో ఆస్పత్రి వైస్ చైర్మన్ ప్రీతా రెడ్డి, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనా కేంద్రం చైర్మన్ సౌమ్య, ఆధ్యాత్మిక ప్రవచనకర్త దేశ మంగైయార్‌కరసి సహా మొత్తం 35 మందికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు, స్థానిక డీఎంకే నేతలు, కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.


టి.నగర్‌లోని మల్టీలెవల్ కార్‌పార్కింగ్‌ను బుధవారం పరిశీలించి, అధికారులకు సూచనలు చేస్తున్న జీసీసీ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

మైలాపూర్ పంగుణి ఉత్సవాల నేపథ్యంలో
ట్రాఫిక్ మార్పులు


ఉత్సవాలకోసం మాడవీధిలో నిర్మించిన పందిరి

టి.నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మైలాపూరులోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం కర్పగాంబాళ్ సమేత కపాలీశ్వరాలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు వార్షిక పంగుణి ఉత్సవాలు నిర్వహించనుండటంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉత్సవాలు జరిగే మాడవీధుల్లోకి వాహనాలను అనుమతించే ప్రసక్తి లేదన్నారు. రాయపేట హైరోడ్డు నుండి లజ్ కార్నర్ మీదుగా అడయార్ వెళ్లే వాహనాలు లజ్ చర్చిరోడ్డు, డిసిల్వా రోడ్డు, భక్తవత్సలం రోడ్డు, కామరాజర్‌రోడ్డు, శ్రీనివాస అవెన్యూ, ఆర్కేమఠం రోడ్డు మీదుగా గ్రీన్‌వేస్ జంక్షన్ మీదుగా వెళ్ళాలని తెలిపారు. ఇదే విధంగా అడయార్ నుండి లజ్ కార్నర్ మీదుగా రాయపేటకు వెళ్లే వాహనాలు ఆర్కే మఠం రోడ్డు, వార్న్ రోడ్డు, రంగా రోడ్డు, ఈస్ట్ అభిరామపురం ఫస్ట్ స్ట్రీట్, లజ్ అవెన్యూ, అమృతాంజనం జంక్షన్, కర్పగాంబాళ్ నగర్, పీఎస్ శివసామి రోడ్డు, రాయపేట హైరోడ్డు మీదుగా వెళ్ళాలని వివరించారు. ఆళ్వార్‌పేట జంక్షన్ నుండి లజ్ జంక్షన్ మీదుగా వెళ్లే వాహనాలు ఆలివర్‌రోడ్డు, పీఎస్ శివసామి రోడ్డు కూడలి, వివేకానంద కాలేజీ, రాయపేట హైకోర్టు మీదుగా గమ్యస్థానాలకు చేరవచ్చన్నారు. ఈ నెల 5న అధికార నంది ఉత్సవం జరిగే రోజు ఉదయం ఐదు గంటల నుండి వేడుకలు ముగిసేంతదాకా, 9న రథోత్సవం రోజున ఉదయం 6 నుంచి వేడుకలు ముగిసేంతవరకూ, ఈ నెల 10న అరపత్తుమువ్వర్ విళా జరిగేరోజున మధ్యాహ్నం ఒంటి గంటల నుండి వేడుకలు పూర్తయ్యేంతవరకూ ఈ ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఇక పంగుణి ఉత్సవాల ప్రారంభం నుండి ముగిసేంతవరకూ ఆలయం చుట్టూ ఉన్న మాడవీధుల్లో వాహనాల పార్కింగ్‌పై నిషేధం అమలు చేయనున్నట్లు తెలిపారు.


'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' సందర్భంగా బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పురావస్తు తవ్వకాల్లో బంగారు పూసలు లభ్యం



వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వెంబకోటలో చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో 2.04 మీటర్ల లోతులో బంగారంతో చేసిన పూసలు లభ్యమయ్యాయి. వెంబకోట విజయకరిచల్‌కుళం ప్రాంతంలో మూడో విడత పురావస్తు తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాల్లో అరుదైన పలు రకాల వస్తువులు లభ్యమయ్యాయి. ఈ వస్తువులతో వెంటకోట ప్రాంతం వాణిజ్య ప్రాంతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో, మూడో విడత తవ్వకాల్లో 2.04 మీటర్ల లోతున బంగారు చేసిన చేసిన పూసలు లభ్యమయ్యాయి. ఈ విషయాన్ని మంత్రి తంగం తెన్నరసు తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. వెంబకోట పురావస్తు తవ్వకాల్లో బంగారు పూజలు లభ్యమయ్యాయని తెలిపారు. ఈ పూసలు 6 మి.మీ చుట్టుకొలత, 4.7 మి.మీ వ్యాసంతో 22 మి.గ్రా బరువుతో ఉన్నాయని తెలిపారు. వెంబకోట తవ్వకాల్లో ఇప్పటివరకు బంగారంతో చేసిన ఏడు వస్తువులు లభ్యమైనట్లు మంత్రి తెలిపారు.

ఏర్కాడుకు పర్యాటకుల తాకిడి

అడయార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన ఏర్కాడుకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. కొడైక్కెనాల్, ఊటి ప్రాంతాలకు వెళ్ళేందుకు ఈ-పాస్ విధానం అమల్లోకి రావడంతో అనేక మంది పర్యాటకులు ఏర్కాడుకు వస్తున్నారు. దీంతో ఏర్కాడులో పర్యాటకుల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది కొండపైకి వచ్చే వాహనాలతో ఘాట్ రోడ్డులో రద్దీ నెలకొంది. సాధారణంగా వేసవి సెలవుల్లో కొడైక్కెనాల్, ఊటీ, ఏర్కాడు వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వచ్చి సేదతీరుతుంటారు. అయితే, కొడైక్కెనాల్, ఊటీలకు పర్యాటకుల వాహనాలు భారీగా వస్తుండటంతో ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఏర్కాడుకు మాత్రం ఈ పాస్ విధానం లేదు దీంతో అనేక మంది పర్యాటకులు ఏర్కాడుకు వస్తున్నారు. ఈ కారణంగా ఏర్కాడులోని ప్రభుత్వ, ప్రైవేటు రిసార్టులు, హోటల్స్ పర్యాటకులతో నిండిపోయాయి. అలాగే, ఇక్కడ ఉండే బోట్ క్లబ్, ఇతర పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా కనిపిస్తున్నాయి.




కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఎంపీ తంబిదురై

మంత్రి నిర్మలా సీతారామన్‌తో
అన్నాడీఎంకే ఎంపీ భేటీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు తంబిదురై బుధవారం మధ్యాహ్నం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి గత వారం పార్టీ సీనియర్ నేతలతో కలసి కేంద్ర మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో అన్నాడీఎంకే సీనియర్ నేత తంబిదురై సమావేశమై పలు విషయాలు చర్చించినట్లు సమాచారం.

ఉత్తమ సీఎండీగా ప్రసన్నకుమార్

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ మోటుపల్లి ఈ ఏడాదికిగాను ఉత్తమ సీఎండీగా ఎంపికయ్యారు. ఒడిశా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇటీవల భువనేశ్వర్‌లో 'ది ఇంటర్వ్యూ టైమ్స్' నిర్వహించిన 'ఉత్కర్ష్ ఒడిశా బిజినెస్ లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవంలో నిర్వాహకులు ప్రసన్నకుమార్‌కు 'సీఎండీ ఆఫ్ ది ఇయర్' అవార్డు ప్రదానం చేశారు. జాజ్‌పూర్ ఎంపీ డాక్టర్ రవి నారాయణ్ బెహరా, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత సుదర్శన్ సాహు, భువనేశ్వర్ మేయర్ సులోచనా దాస్ తదితరుల సమక్షంలో పురస్కార ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా రవి నారాయణ బెహరా మాట్లాడుతూ.. ఒడిశా అభివృద్ధికి, ముఖ్యంగా విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో, ఎన్ఎల్‌సీఐఎల్ స్థిరమైన అభివృద్ధి కార్యక్రమాలను నడిపించడంలో ప్రసన్నకుమార్ చేసిన అద్భుతమైన కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. ఒడిశా గొప్ప సహజ వనరులను భారతదేశాభివృద్ధికి కీలకమైన ఉత్ప్రేరకంగా అభివర్ణించారు. ఒడిశాలోని సంబల్‌పూర్, ఝార్సుగుడ జిల్లాల్లోని తలాబిరా 2, 3 బొగ్గుగనుల సహా ఆ రాష్ట్రంలో ఎన్ఎల్‌సీఐఎల్ ప్రభావవంతమైన ప్రాజెక్టులను ఆయన ప్రదర్శించారు.


ప్రసన్నకుమార్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఫుడ్ డెలివరీ వర్కర్స్‌కు 'ఏసీ' రెస్ట్ రూమ్


విశ్రాంతి గది నమూనా

పెరంబూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో ఫుడ్ డెలివరీ ఉద్యోగుల సౌకర్యార్థం 'ఏసీ' విశ్రాంతి గదులు ఏర్పాటుకానున్నాయి. ప్రధాన నగరాల్లో స్విగ్గీ, జుమాటో తదితర సంస్థలు 24 గంటలకు ఆహార పదార్థాలు అందిస్తున్నాయి. ఈ సంస్థల్లో వందలాది మంది డెలివరీ ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో 10 శాతం మంది మహిళలున్నారు. వీరు టాయిలెట్, తాగునీటి వసతి లేకుండా అవస్థలు పడుతున్నారు. ఫుడ్ డెలివరీ లేని సమయాల్లో రోడ్ల పక్కన చెట్ల కింద సేదతీరుతున్నారు. ఈ నేపథ్యంలో, వీరి సౌకర్యార్థం నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ఏసీతో కూడిన విశ్రాంతి గదులు ఏర్పాటుచేయాలని జీసీసీ నిర్ణయించింది. ఈ గదుల్లో టాయిలెట్, మంచి నీటి వసతి, మొబైల్ ఛార్జింగ్ సౌకర్యం, కుర్చీలు తదితరాలు ఏర్పాటుకానున్నాయి. నగరంలో ప్రధాన ప్రాంతాలైన అన్నానగర్, నుంగంబాక్కం, రాయపేట, మైలాపూర్, టి.నగర్ సహా ఉద్యోగులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ గదులు ఏర్పాటుకానున్నాయి. విశ్రాంతి గదుల ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, అనుమతులు లభించిన వెంటనే గదులు ఏర్పాటు ప్రారంభిస్తామని జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్ తెలిపారు.



వైకుంఠం-1 వద్ద కొత్త షెడ్

● రూ.300 దర్శన భక్తుల కోసం..

నిర్మాణంలో రూ.300 దర్శన భక్తుల అదనపు షెడ్

తిరుమలలో వైకుంఠం1 క్యూకాంప్లెక్స్ వద్ద కొత్త షెడ్ నిర్మాణం జరుగుతోంది. గతంలో రూ.300 దర్శన భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ ప్రస్తుతం ఇరుకుగా మారిపోయింది. క్యూలైన్ కూడా వెలుపలకు వచ్చేస్తోంది. దీంతో రూ.300 దర్శన టికెట్లు బుక్ చేసుకుని దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అదనపు షెడ్‌ను నిర్మించాలని సూచించారు. సమాచారకేంద్రం వద్దనున్న డిస్నీ టీపీ వద్ద నుంచి వైకుంఠం1 కాంప్లెక్స్ ప్రవేశం వరకు అదనపు షెడ్ నిర్మాణం కోసం రూ.1.06 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే వెయ్యి నుంచి 1,500 మంది భక్తులు ఇందులో వేచి ఉండవచ్చు. నెలలో ఈ షెడ్ భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రానైట్ క్వారీలో పేలుళ్లు

● బాలుడికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని చెర్లోపల్లెలో గ్రానైట్ క్వారీలో పేలుళ్ల కారణంగా రెండేళ్ల బాలుడు దినేష్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణంరాజుకు చెందిన మామిడి తోటలో రమేష్ కుటుంబం కాపలాగా ఉంటుంది.ఆ పక్కన గ్రానైట్ క్వారీలో బుధవారం మధ్యాహ్నం నిర్వాహకులు పేలుళ్లు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ రాయి రమేష్ కుమారుడు దినేష్‌కు తగలడంతో తలకు తీవ్రగాయమైంది. బాలుడిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు సమాచారం.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,981

తలనీలాలు సమర్పించినవారు: 21,120



ఇప్పుడు గోదాముకు ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు



గత ఏడాది డిసెంబరులో ఏకొల్లులోని గోదాము చుట్టూ చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫొటో)

చెరువులో గోడౌన్

● వైసీపీ పాలనలో ముందుచూపు లేక రూ.40 లక్షలతో నిర్మాణం
● వర్షాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్న వైనం
● ఇప్పుడు మరో రూ.27 లక్షలతో సిమెంటు రోడ్డు
● అధికారుల తీరుపై విమర్శలు

చెరువులో గోదాము కట్టొద్దని అప్పుడే రైతులు మొత్తుకున్నారు. అయినా, నాటి వైసీపీ పాలనలో చెవికెక్కించుకోలేదు. కట్టి తీరతామన్నట్లు భీష్మించారు. ఫలితం.. ఆ తర్వాత వర్షాలకు నీళ్లల్లో చిక్కుకుపోయిందా గోదాము.

ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. అయినా, అధికారుల తీరు మారలేదు. చెరువులోని ఆ గోదాముకు రూ.27 లక్షలతో కొత్తగా రోడ్డేశారు. వైసీపీ పాలకులు చేసిన తప్పును కప్పిపుచ్చడానికే ఈ పని చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

రైతులు ధాన్యం నిల్వ చేసుకుని, సరైన మద్దతు ధరకు అమ్ముకునేలా 2022లో వైసీపీ ప్రభుత్వం దొరవారిసత్రం మండలానికి నాలుగు గోదాములను మంజూరు చేసింది. ఒక్కోదానికి నాబార్డు ద్వారా ఎస్‌డీసీసీబీ రుణంతో రూ.40 లక్షలు మంజూరు చేశారు. నెలబల్లి, ఏకొల్లు, వేణుంబాక, తొగరాముడి గ్రామాల్లో.. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. నాటి వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఏకొల్లు గోదామును అనువైన ప్రదేశంలో నిర్మించలేదు. ఏకొల్లు రోడ్డుకు పక్కనే, రెడ్డిగుంట చెరువులో నిర్మించారు. దీనివల్ల ఆ గోదాము రైతులకు ఉపయోగపడదనే విషయాన్ని అధికారులు నిర్లక్ష్యంగా తీసుకొన్నారు. దీంతో లక్ష్యం మంచిదైనా ఆచరణలో నీరుగారింది. గత వర్షాకాలంలో చెరువు నీరు గోదామును చుట్టుముట్టేయడంతో రైతులంతా ఆవేదన వ్యక్తంచేశారు.



సిమెంట్ రోడ్డు పనులకోసం.. పక్కనే చెరువు మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

దీనిని గుర్తించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ఇలా గత ప్రభుత్వంలో రూ.40 లక్షలను 'నీటి'పాలు చేశారు.

ఆ రోడ్డూ అంతంతమాత్రమే

2023-24లో నీటిలో గోదాము జలదిగ్బంధమైన వైనాన్ని అధికార యంత్రాంగం కళ్లారా చూసినా మేలుకోలేదు. సరికదా మరో తప్పిదానికి పాల్పడింది. రూ.27 లక్షలతో అక్క సిమెంట్ రోడ్డు వేయించింది. ప్రస్తుత ప్రభుత్వం రోడ్లకు నిధులు ఇవ్వడాన్ని అధికారులు తమకు అనుకూలంగా మలచుకుని.. గతంలో తమ తప్పు బయటపడకుండా ఆదరాబాదరాగా లోతట్టు ప్రాంతంలోని గోదాముకు రోడ్డు వేయించారు. దీనికితోడు అక్కడే ఉన్న చెరువులో తవ్విన మట్టితో రోడ్డు వేశారు. దీనిపైనే సిమెంట్ రోడ్డు వేశారు. మట్టి పనుల్లో కనీసం రోలింగ్ నియమాన్ని పాటించలేదనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఆనుకునే మట్టిని తవ్వారు. సిమెంట్ రోడ్డు పనుల్లోనూ నాణ్యత కొరవడింది. వర్షాకాల ంలో ఈ రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సమీపంలోనే తెలుగంగ కాలువ ఉంది. ఈ కాలువకు గత డిసెంబరులో పడిన గండిని ఇప్పటికీ పూడ్చలేదు. ఆ గండి ద్వారా వరద నీరొస్తే గోదామును ముంచెత్తుతుందంటున్నారు. జాతీయ రహదారి పక్కన ఖాళీ భూమిలో గోదాము నిర్మించి ఉంటే ఉపయోగపడే బాగుండేదని రైతులు చెబుతున్నారు.

వీఆర్‌కు గాజులమండ్యం హెడ్ కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకేచోట ఉంటున్న ఈయనపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ నందిస్తూ స్పెషల్ బ్రాంచ్ అధికారులను విచారణకు ఆదేశించారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన ఎస్‌బీ అధికారులు ఎస్పీకి నివేదిక సమర్పించారు. దీనిపై వెంటనే హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు పంపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా సరే భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ సీనియర్ నేత ధనంజయులు మృతి



ధనంజయులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, తిరుపతికి చెందిన గాలి ధనంజయులు నాయుడు(83) మృతిచెందారు. బైరాగిపట్టెడ ఎంకే నాయుడు కాలనీలోని ఆయన స్వగృహంలో బుధవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్‌తో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె, బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత చెప్పారు. ఈయన 1977కు ముందునుంచే జనతా పార్టీలో పనిచేశారు. 1980లో బీజేపీగా రూపాంతరం చెందడంతో అందులోనూ చురుగ్గా పనిచేశారు. 1985లో బీజేపీ నగర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1990లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. తన కుమార్తె గాలి పుష్పలతను వారసురాలిగా రాజకీయ క్షేత్రంలోకి దింపారు. కుమారుడు గాలి భరత్ కుటుంబం అమెరికాలో ఉండటంతో ఆయన వచ్చాక శుక్రవారం ఉదయం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్థివదేహాన్ని స్విమ్స్ మార్చురీలో భద్రపరిచారు.





విద్యుత్ దీపాలంకరణలో దర్గా, ఆర్చి

నేటినుంచి హజరత్ అమీర్‌షావలి ఉరుసు

● ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో 8 ఏళ్ల తరువాత ప్రారంభం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీకగా.. కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలను మొదటసారి 1960లో ప్రారంభించారు. అప్పటి నుంచి హిందూ.. ముస్లింలు కులమతాలకు అతీతంగా ఐక్యతతో ఉరుసు జరుపుకుంటుండంతో ప్రత్యేకత సంతరించుకుంది. 2016 వరకు నిర్విఘ్నంగా సాగిన ఉరుసు ఉత్సవాలు... నిర్వహణ విషయమై వివాదాలు నెలకొనడంతో 2017 నుంచి ఆగిపోయాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చొరవ తీసుకొని కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఈ ఏడాది ఉరుసు నిర్వహించేందుకు కృషి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ గురువారం రాత్రి శ్రీవారి గంధం... దొర్నాదుల చెంచుకృష్ణయ్య ఇంటి వద్ద నుంచి బయలుదేరి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, ఫకీర్ల భజనల నడుమ పట్టణంతా ఊరేగి తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకొని రాహూరు వారి చేత చదివింపులు స్వీకరిస్తారు. 4వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు నిస్మి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ పాటకచ్చేరి. 5వ తేదీ శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి జబర్దస్త్ టీమ్ ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉరుసు ఉత్సవాలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రానుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 14 మంది ఎస్‌ఐలు, 212 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

● 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి
● 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ వారిని పాతపెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 3 పెండింగ్ డీఏను వెంటనే విడుదల డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీహెచ్ రమేష్, గాజుల నాగేశ్వరరావు, శేఖర్, రామచంద్రయ్య, మురళీకృష్ణ, జగన్నాథం, రమేష్, బాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, మల్లికార్జున, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు ప్రారంభం

● పర్యవేక్షించిన ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో 53 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కల్పించిన వసతుల పట్ల వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై కోర్టు, యూజీసీ, డెబ్ ఆదేశాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

● 1.85 లక్షల జవాబు పత్రాలు.. 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి 9వ తేది వరకు తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనుంది. దీనిని అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ బుధవారం వెల్లడించారు. జిల్లాకు 1.85 లక్షల జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనంకోసం ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, 130 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 775 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 260 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 10 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లను నియమించారు. అలాగే ఓపెన్ స్కూల్‌కు సంబంధించి జిల్లాకు 16,324 జవాబు పత్రాలను కేటాయించారు. వీటి మూల్యాంకనానికి 21 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 100 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 21 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ప్రతి ఎగ్జామినర్ రోజుకు 40 పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వేసవి నేపథ్యంలో కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు, విస్తృతంగా ఏర్పాటు చేశామని డీఈవో కుమార్ చెప్పారు.

పోలీసుల అదుపులో ఆరుగురు కిడ్నాపర్లు!

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు.. మీ సేవలో నెలకొన్న విభేదాల కారణంగా రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈనెల 29న తిరుపతి నగరం అక్కారంపల్లికి చెందిన అరుణ్, జీవకోనకు చెందిన భార్గవ్‌తో పాటు రేణిగుంటకు చెందిన మరో నలుగురు కలిసి కిడ్నాప్ చేసిన విషయం విదితమే. రాజేష్, భార్గవ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఎలాగైనా రాజేష్ నుంచి రూ.రెండు కోట్లు దండుకోవాలనే దురుద్దేశంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. దీని కోసం సెటిల్‌మెంట్లు, భూ దందాల్లో ఆరితేరిన అరుణ్‌ను సంప్రదించాడు. ఆ ప్రకారం ఈ నెల 29న రాజేష్‌ను అపార్టుమెంటు వద్దకు రావాలని ఫోనులో పిలిచాడు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షలను తిరిగివ్వాలని రాజేష్ కొంతకాలంగా అడుగుతుండటం, భార్గవ్ వైఖరిపై అనుమానంతో ఇతడు తల్లి విజయ, భార్య సుమతి, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లాడు. తనకు రూ.రెండు కోట్లు ఇవ్వాలని భార్గవ్, అరుణ్ కలసి రాజేష్‌ను అడగ్గా అంత డబ్బులు లేవని చెప్పారు. అయితే ఇల్లు, ఆస్తులు రాసివ్వాలని బెదిరించారు. దీనికోసం రాజేష్‌ను ఒక కారులో, అతడి కుటుంబ సభ్యులను మరో కారులో ఎక్కించుకుని బెంగుళూరు వైపు వెళ్లారు. ఈ సందర్భంగా కిడ్నాపర్లు కొన్ని మారణాయుధాలతో బెదిరించినట్లు సమాచారం. రాజేష్ తప్పించుకోవడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అందరినీ వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన అరుణ్‌తో పాటు భార్గవ్, రేణిగుంటకు చెందిన మరో నలుగురిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటన జరిగిన మరుసటి రోజు కిడ్నాపర్ల కదలికలపై సీఐ రాంకిషోర్, అలిపిరి ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్ బాబు నిఘా ఉంచి చాకచక్యంగా బెంగళూరు, హైదరాబాదుకు వెళుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరు ప్రధాన నిందితులపై రౌడీషీట్‌లు ఓపెన్ చేసే యోచనలో పోలీసులున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహరావు

భూగర్భ డ్రైనేజీ క్లీన్ చేస్తూ కార్మికుడి మృతి

● అపస్మారక స్థితిలో మరో ఇద్దరు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్ పాలెంలో భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలను తొలగించే క్రమంగా ఊపిరాడక కార్మికుడు నాగరాజు(41) మృతి చెందగా, మరో ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇక్కడి భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వచేరి.. మురుగు ముందుకు సాగక దుర్వాసన వస్తోంది. దీనిని శుభ్రం చేసేందుకు బుధవారం నలుగురు కూలీలు వచ్చారు. మ్యాన్‌హోల్ నుంచి నాగరాజు లోపలకు దిగారు. వ్యర్థాలను కాస్త తొలగించగా, ఎగువ నుంచి మురుగునీరు వచ్చింది. ఆ దుర్వాసన, వాయువులతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరారు. పది నిమిషాల తరువాత నాగరాజును పిలిచినా స్పందన లేకపోవడంతో తోట గురువయ్య అనే మరో కార్మికుడు దిగారు. ఎంతసేపటికీ వీరిద్దరు బయటకు రాకపోవడంతో శివ, తుపాకుల ధర్మ లోపలకు దిగారు. అప్పటికే నాగరాజు మృతి చెందగా, గురవయ్య అపస్మాకర స్థితిలో ఉన్నారు. వెంటనే నాగరాజు మృతదేహంతో పాటు గురవయ్యను బయటకు తీసుకొచ్చారు. అదే సమయంలో శివ కూడా అపస్మారక స్థితికి చేరారు. వెంటనే షార్ రోడ్డులోని సతీష్‌ధావన్ మెమోరియల్ వైద్యశాలకు తరలించారు. ప్రథమిక చికిత్స అనంతరం తోట శివ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజు స్వగ్రామం సూళ్లూరుపేట మండలంలోని దావాదిగుంట. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



నాగరాజు (ఫైల్‌ఫొటో)

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట శివ



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఎస్వీయూలో చిరుత దాడిలో జింక మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో ఓ జింకను చిరుత చంపినట్టు తెలుస్తోంది. ఈ ఘటనను బుధవారం సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారం ఆనవాళ్లను పరిశీలించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. కొన్ని రోజులుగా ఎస్వీయూలో సెంట్రల్ లైబ్రరీ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల్లో చిరుత సంచారం కనిపిస్తోంది. లైబ్రరీ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు జింకలను చంపడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.